# ఇలాగ తీరింది



"మీరిలా బస్సుల్లో పడి ఒళ్ళు హూనం చేసుకుంటూ ఎన్నాళ్ళని ఆఫీసు కెళ్తారండీ! నా మాట విని ఎంచక్కా ఓ స్కూటర్ కొనుక్కోండి. మీ ఆఫీసువాళ్ళిచ్చే లోను చాలకపోతే నా చంద్రహారంలోని ఓ పేట యిస్తాను. అమ్ముతారో, తాకట్టే పెడతారో మీ యిష్టం. మన సుఖంకోసం రాకపోతే యీ డబ్బూ యీ బంగారమూ యింకెందుకు చెప్పండి?"

ఇంతలా చెప్పి చెవినిల్లు కట్టుకుని పోరినా సీత మాట విన్పించుకోలేదు రామ్మూర్తి. అతను రోజూ సిటీబస్సులో తిరగలేక అవస్త పడుతూన్నమాట నిజం. కానీ పదో పన్నెండో వేలుపోసి స్కూటర్ కొనడమంటే మాటలు కాదు. స్కూటర్ కొనుక్కుందికి రామ్మూర్తి ఆఫీసులో లోను యిస్తారు. కానీ అది ఎటూ చాలదని అతని అభిప్రాయం. అలా అని సీత చెప్పినట్టు బంగారపు వస్తువు అమ్ముకుని యినప వస్తువు కొనుక్కోడానికి అతనికి మనసొప్పటం లేదు.

ఈ విషయంలో సీత మాత్రం చాల పట్టుదలగానే వుంది. రామ్మూర్తి కంటే తక్కువ జీతం, తక్కువ హోదా కలిగి యున్న వాళ్ళ ఎదురింటి వామనరావు కూడ యిటీవలే ఓ స్కూటర్ కొన్నాడు.

స్కూటర్ వుంటే ఎక్కడకు వెళ్ళాలన్నా టైం కలిసొస్తుంది. పదిగంటల ఆఫీసుకు తొమ్మిదికే బయల్దేరే రామ్మూర్తి మరో అరగంట ఆలస్యంగా బయల్దేర వచ్చు. తను కూడ వంట కాస్త తాపీగా చేసుకోవచ్చు. సాయంకాలాలు తొందరగా వచ్చేస్తే ఎంచక్కా యిద్దరూ ఎక్కడికైనా దానిపై హాయిగా వెళ్ళిరావొచ్చు. అంచేత తన కోర్కెను తీర్చుకోడానికి తన చంద్రహారంలోని ఒక పేటను కూడ త్యాగం చేయదల్చుకుంది సీత.

సీతకీ రామ్మూర్తికీమధ్య ఈ విషయంలో ఎన్నో వాదోపవాదాలు జరిగేయి. చివరికి అతి సహజంగానే సీత గెల్చింది. ఓ శుభముహూర్తాన రామ్మూర్తి స్కూటర్ కొనేశాడు!

ఓ నెల్లాళ్ళలో రామ్మూర్తి డ్రైవింగ్ పూర్తిగా నేర్చుకొని, రెండో నెలలోనే యిద్దరూ చిలకా గోరింకల్లా స్కూటర్ మీద సినిమాలకి షికార్లకి వెళ్ళడం జరిగింది. (చిలకా గోరింకలు నిజమైన జంట కావంటారు కొందరు. అయినా కాకపోయినా అవి స్కూటర్ మీద సినిమాల కెళ్ళవ్- అది వేరే సంగతి!)

మూడో నెల ఆరంభంలోనే తెలుగు సినిమా విరామంముందు కథలో తిరిగే మలుపులాంటి మలుపొకటి రామ్మూర్తి కథలోనూ తిరిగింది.

అది.... రామ్మూర్తి ట్రాన్స్ఫర్!

ఎన్నాళ్ళగానో రామ్మూర్తి ఎదురు చూస్తున్న ప్రమోషన్ వచ్చింది- దాంతోపాటే మరో రాష్ట్రంలోని మారుమూల వూరికి ట్రాన్స్ఫర్ కూడ అయింది-

ఉద్యోగికి దూరభూమి లేదనుకున్నాడు రామ్మూర్తి. కానీ సీతకి చాల నిరుత్సాహమే కలిగింది- వెళ్ళబోయేది అటు పట్నానికి యిటు పల్లకూ చెందని ఓ మధ్య తరగతి వూరికి- అక్కడి రోడ్లు స్కూటర్కి అనువుగా వుంటాయో వుండవోనని ఆమె బెంగ- ప్రమోషన్ ఆపించుకోడమో ఊరు మార్పించుకోడమో చేయమని రామ్మూర్తిని పోరింది. కానీ ఈమారు రామ్మూర్తి విన్పించుకోలేదు-

కానీ ఆ ఊరు వెళ్ళటానికి సిద్ధపడే ముందు రామ్మూర్తికో ఆలోచనొచ్చింది. వెళ్ళేది ఎలాగూ చిన్న వూరికి. మళ్ళీ ట్రాన్స్ఫర్ ఎన్నాళ్ళకొస్తుందో ఏమో! అంతవరకూ అక్కడ స్కూటర్ అవసరం అంతగా వుండకపోవచ్చు అంచేత అది అమ్మేస్తేనో—అనుకున్నాడు.

ఈ మారు సీత రామ్మూర్తి ఆలోచనను పడనివ్వలేదు.

స్కూటర్ కొని ముచ్చటగా మూడు నెలలైనా కాలేదు- ఇంకా ముచ్చట్లూ సరదాలూ తీరనేలేదు- అంచేత అమ్మడానికి వీల్లేదంది- సరే- యీ మారు నువ్వే గెలువ్ అన్నట్లూరుకున్నాడు రామ్మూర్తి.

*  *  *

కొత్త వూరెళ్ళాక అక్కడి పరిస్థితిని చూసి నిజంగానే డీలా పడిపోయింది సీత- అక్కడ వారెవరికీ తెలుగురాదు- గుజరాతీ,హిందీ కలగాపులగం చేసి మాట్లాడతారు- ఆ వూళ్ళోవున్నవి నాలుగొందల యిళ్ళు మాత్రమే- ఉన్నరోడ్లన్నీ మట్టివే-

రామ్మూర్తి ఆఫీసుకి అరఫర్లాంగు దూరంలోనే యిల్లుదొరికింది. ఉన్న ఒకే ఒక టూరింగ్‌టాకీసు కూడ వూరిమధ్యలో వుంది.

ఈ కారణాలచేత చాల రోజులు రామ్మూర్తికి స్కూటర్ బయటకు తీసే అవసరమే లేకపోయింది- సీత మాత్రం రోజూ ఏదో ఒక సమయంలో బాధపడుతూనే వుండేది- యిన్నివేలు పోసి కొన్నది యింట్లో ఉంచుకోడానికేనా అని!

సరిగ్గా అదే సమయంలో- ఆ వూళ్లో మరో తెలుగు మాట్లాడే కుటుంబం కూడ వున్నట్లు రామ్మూర్తి దృష్టికి వచ్చింది-

ఆ కుటుంబ పెద్ద వాసుదేవరావు! అచ్చమైన తెలుగువాడూ; ఇన్సూరెన్సు కంపెనీ ఏజెంటూ-

మొదట వాసుదేవరావేవచ్చి రామ్మూర్తిని పరిచయం చేసుకున్నాడు- తర్వాత రామ్మూర్తినీ సీతనీ తనింటికి ఆహ్వానించేడు-

ఆ కుటుంబ సభ్యులు చూపించిన ఆప్యాయతకీ, కలుపుగోరుతనానికీ సీత ఎంతో మురిసి పోయింది.

ఐతే, వాసుదేవరావు యొక్క చొరవకీ. కలుపుగోరు తనానికీ, రామ్మూర్తి మెతకదనానికీ ఆ తర్వాత సీత చాలా మాట్లే విసుక్కుంది.

పరిచయమైన వారం తిరక్కుముందే వాసుదేవరావు వచ్చి స్కూటర్ ఓమారు కావాలని అడిగేడు- ఏదో పట్నంవెళ్ళే పని అర్జంటుగా పడిందట- ఓ పూటలో తీసుకొచ్చేస్తానన్నాడు- మొదట మొహమాటంలో పడ్డా యివ్వక తప్పలేదు రామ్మూర్తికి.

అ తర్వాత కూడా వారానికీ పదిరోజులకీ ఓమారు అడిగి తీసుకెళ్ళడం అలవాటు చేసుకున్నాడు వాసుదేవరావు. రామ్మూర్తి సంకట పరిస్థితిలో పడిపోయాడు. భర్తమీద విసుక్కోడం తప్పితే సీతకూడా మరేం చేయలేక పోయింది.

పోనీ.... యికపై నిర్మొహమాటంగా వుందామనుకున్నా కలుపుగోరుగా వుంటూ తెలుగు మాట్లాడే కుటుంబం అదొక్కటే. ఈ వొక్క విషయంలో తప్పితే వాళ్ళతో దూరంగా వుండాలంటే కష్టమే అన్పించింది.

"ఈయనగారికి ఏ జన్మలోనో అప్పున్నాం- అది యీరూపంలో తీర్చుకుంటున్నట్లుంది" అన్నాడు రామ్మూర్తి విసిగిపోయి.

"మరి కొన్నాళ్ళు పోతే ఆ ఋణం కాస్తా తీరిపోయి తిరిగి ఆయనే ఋణగ్రస్తుడయ్యేట్టుంది" అంది సీత.

ఇలా ఇద్దరూ అనుకున్న రెండ్రోజులనాడే వాసుదేవరావు వచ్చాడు వాళ్ళింటికి-

పొద్దున్నే ఆయనను చూసేసరికి సీత గుండెల్లో రాయిపడింది.

"ఈమారు ఏదో ఒక అబద్ధం చెప్పేయండి. స్కూటర్ మాత్రం యివ్వొద్దు" అంది సీత రామ్మూర్తిని చాటుకి పిల్చి.

కానీ యీమారు వాసుదేవరావు స్కూటర్ని అడగలేదు. ఆ మాటా యీ మాట చెబుతూ అసలు విషయాన్ని బయటపెట్టేడు.

"చూడండి రామ్మూర్తిగారూ నేను మీ స్కూటర్ని చాలమార్లే అడిగి తీసుకెళ్ళేను– వాడుకున్నాను. అంచేత నేను మీకెంతో ఋణ పడిపోయినట్టు అన్పిస్తోంది. మళ్ళీ అడగాలంటే సిగ్గేస్తోంది" అంటూ ఆగేడు.

రామ్మూర్తి ఏం మాట్లాడలేదు.

"ఇన్నాళ్ళకు జ్ఞానోదయమైందన్న మాట" అని మనసులో అనుకున్నాడు. ఈలోగా వాసుదేవరావే అన్నాడు.

"అంచేత — నేనా ఋణాన్ని తీర్చుకోవాలనుకుంటున్నాను" ఈమాటు రామ్మూర్తి, సీతకూడ ఆశ్చర్యపోయారు.

"అంటే — అద్దెగాని చెల్లిస్తారేంటి కొంపదీసి" అంది సీతే జోగ్గా–

"కాదులెండి" అనేసి అసలు విషయం చెప్పేడు వాసుదేవరావు.

అది విన్న రామ్మూర్తి యిబ్బందిగా మొఖం పెట్టేడు– ఆ తర్వాత దాని మెయింటినెన్సు, టాక్సుల సంగతీ గుర్తొచ్చి సరేనన్నాడు

అంతే!

ఆ మర్నాడే డబ్బువచ్చే మార్గానికి ప్రారంభోత్సవం చేశాడు. యిన్సూరెన్సు ఏజెంట్ వాసుదేవరావు. ఓ మెకానిక్‌నిపిలిచి స్కూటర్ పార్టులు కొన్ని తీయించేశాడు. ఆ తర్వాత ఇన్సూరెన్సు కంపెనీ సర్వేయర్‌తో 'ఇంగ్లీషు' మాట్లాడి, బండికి ఏక్సిడెంటయినట్టు సర్టిఫై చేయించాడు– తర్వాత రామ్మూర్తి చేత క్లెయిమ్ పెట్టించాడు–కొత్త పార్టులు కొన్నట్లు బిల్సు పుట్టించి, తర్వాత స్కూటర్ బాగుచేయించినట్టు భ్రమింపజేసి, ఆ సర్టిఫికెట్సునీ. బిల్సునీ యిన్సూరెన్సు ఆఫీసుకు పంపించేడు.

ఈ తతంగమంతా రామ్మూర్తికి అర్థంకాలేదు. మొదట- సీత కూడా అదే పరిస్థితిలో వుంది.

"నిక్షేపంలాంటి బండి- ఏక్సిడెంట్ ఏమిటండీ? ఈ వ్యవహారం చూస్తె నాకేదో భయంగా వుంది" అంది.

రామ్మూర్తేం మాట్లాడలేదు.

కానీ యిది జరిగిన రెండు నెల్లకు ఇన్సూరెన్స్ కంపెనీ నుండి రామూర్తికి పదిహేనువందల రూపాయలు ముట్టేయి-

"ఇందులో వెయ్యేమీవి. మిగతావి మావాళ్ళ ఖర్చులు" అన్నాడు వాసుదేవరావు.

అతని తెలివికి రామ్మూర్తి నిజంగానే ఆశ్చర్యపోయేడు. ఆ డబ్బు కూడ తీసుకోకుంటేనే బావుంటుందేమో అనుకున్నాడు.

అతనిలోని సంశయాన్ని చూసిన వాసుదేవరావు.

"మీకెందుకూ? మీరీ వూరు నుండి వెళ్ళేలోగా మరో రెండు మూడువేలు మీకు ముట్టజెప్పిస్తాగా- మీకు కొత్తగానీ నాకేం యిది కొత్తగాదు-" అన్నాడు ఐదువందల రూపాయల నోట్లనీ మడిచి జేబులో పెట్టుకుంటూ-

"ఘటికుడే- మొత్తానికి ఇలా తీర్చుకున్నాడన్నమాట ఋణాన్ని" అంది సీత. ఆ రాత్రి రామ్మూర్తినుండి వెయ్యిరూపాయలూ అందుకుంటూ-